క్లుప్తంగా

టెన్త్‌లో ప్రతిభావంతునికి సత్కారం



సత్తెనపల్లి: పదవ తరగతి ఫలితాల్లో అత్యధికంగా 585 మార్కులు సాధించి ప్రతిభ చూపిన ఉన్నవ ఆదర్శ్‌ను బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ వారు మంగళవారం అభినందించి సత్కరించారు. బ్రాహ్మణ ఐక్య వేదిక తరుపున జ్ఞాపిక, సర్టిఫికేట్, మాదాల వెంకట కృష్ణ దర్మపత్నీ నాగరాజశ్రీ జ్ఞాపకార్థం రూ.1,116 నగదు బహూకరించారు. కార్యక్రమంలో తండ్రి ఉన్నవ ప్రసాద్, బ్రాహ్మణ ఐక్య వేదిక అధ్యక్షుడు పెద్దింటి ఫణి కృష్ణ, ఐక్య వేదిక సభ్యులు కొనంకి మారుతి, ఉన్నవ రాజశేఖర్, మెడికొండురు రాజశేఖర్, ఉన్నవ పూర్ణ చంద్రరావు,కె.కె.విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

అచ్చంపేట: మండలంలోని పెదపాలెంలో మంగళవారం జరిగిన ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమంలో 200 మందికి పైగా వైద్యసేవలు అందించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్యామల తెలిపారు. జ్వరాలు, దగ్గుతో బాధపడేవారినికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. 7గురు జ్వరంతో బాధపడేవారిని గుర్తించి వారికి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఆరోగ్యంపై తగు సూచనలు చేసినట్లు చెప్పారు. ముఖ్యమంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు దరిచేరకుండా దోమతెరలు, విండో నెట్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆశవర్కర్స్, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



రాజుపాలెం: పిల్లలకు కాచి చల్లార్చిన నీరు తాగించాలని, పాలిచ్చే తల్లులు పిల్లలు అనారోగ్యంతో ఉన్నచో వెంటనే వైద్యుని సలహాలు తీసుకోవాలని డాక్టర్ రవితేజ నాయక్ తెలిపారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర ఆధ్వర్యంలో అతిసార నియంత్రణ పక్షోత్సవాలకు సంబందించిన గోడ పత్రికలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 0-5ఏళ్లలోపు పిల్లలు తరచు విరోచనాలకు గురైనట్లైతే ఎలా నియంత్రించాలో వివరించారు. ప్రతీ ఇంటిలో ఏఆర్ఎస్, జింక్ ట్యాబ్లెట్స్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్‌లు జీవన్‌రావు, ఉదయలక్ష్మీ, ఉషారాణి, కమ్యునిటీ హెల్త్ అధికారి దేవానాయక్, ప్రియదర్శిని, హెల్త్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, ఏఎన్ఎంలు రాజ్యలక్ష్మీ, ప్రమీలా, నాగమణి, మేరీ, నాగలక్ష్మీ, తిరుపతమ్మ, ఆవా కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డంకి కాకూడదు

సత్తెనపల్లి: పేదరికం ఎవరి చదువుకు అడ్డంకి కాకూడదని, దీని వల్ల 14 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలను పనులకు పంపకూడదని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాస రావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయ స్థానం ఆదేశాలమేరకు సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ డి. నాగవెంకటలక్ష్మీ సూచనల మేరకు బాలకార్మిక వ్యవస్థను అరికట్టేందుకు జరుగుతున్న ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మంగళవారం పట్టణంలోని 14వ సచివాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు, ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బడికి వెళ్ళాల్సిన పిల్లలను బాలకార్మికులుగా మార్చితే చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయన్నారు. ముందుగా ఆ ప్రాంతంలో ఉన్న పిల్లలు అందరినీ పాఠశాలకు పంపుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పెండ్యాల భరత్, కార్మిక శాఖ ఉద్యోగి శ్రీనివాసరెడ్డి,14 వ సచివాలయం అడ్మిన్ షేక్ అల్లాబక్షు, మహిళా పోలీస్ ఎస్.భవాని కుమారి, ఏ.ఎన్.ఎమ్ లక్ష్మి, పారా లీగల్ వలంటీర్లు షేక్ ఖాజా, షేక్ ముబారక్‌లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అచ్చంపేట: రాబోయే వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల ఉధృతి అధికంగా ఉంటుందని ఆశ వర్కర్స్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ శ్యామల తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశడే సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎవరైనా అతిసారా వ్యాధితో బాధపడుతున్నట్లయితే వారిని వెంటనే వైద్యశాలకు తీసుకువచ్చి తిగిన చికిత్స చేయించాలన్నారు. ఆశ వర్కర్స్ ప్రగతిని మెరుగు పరుచుకోవలసి ఉంటుందన్నారు. జిల్లా లెప్రసీ అధికారి పద్మావతి మాట్లాడుతూ టిబి, లెప్రసి తదితర వ్యాధులను గుర్తించి వారి వివరాలను వైద్యశాలలో తెలియచేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలి ఫిజీషియల్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్ని వైద్యులకు సహకరించవలసినదిగా కోరారు. సత్తెనపల్లి సబ్‌యూనిట్ అధికారి బేగ్, మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, ముందుస్తుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో పర్యటించి తగు జాగ్రత్తలు తెలియచేయాలని సూచించారు. సీహెచ్ఓ శివనాగేశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్ కె.పార్వతి, పీహెచ్ఎన్ మేరి జాన్స్, హెచ్‌వి ఎలిజిబిత్ వివిధ గ్రామాల ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

దిగుబడి తగ్గి .. ధరలు పెరిగి

- మండిపోతున్న కూరగాయల ధరలు
- ఆందోళన చెందుతున్న వినియోగదారులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

సత్తెనపల్లి: మండుతున్న ఎండలు, అకాల వర్షాలతో దిగుబడి తగ్గి కూరగాయల ధరలు వారంల్లోపే భారీగా పెరిగాయి. స్థానిక పంటలు అందుబాటులో ఉన్నా మార్కెట్లకు డిమాండ్ కు సరిపడా రావడం లేదు. ఎండలకు భయపడి పంట కోసేందుకు కూలీలు రావడం లేదు. దీంతో ఒక్కసారిగా ధరలకు రెక్కలు వచ్చాయి. బంగాళదుంపలు, మిర్చి మాత్రం గుంటూరు నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. క్యాప్సికం, బీన్స్,క్యారెట్, టమాటా వంటివి చిత్తూరు జిల్లా పల్లమనేరు నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. మిగిలిన కూరగాయలు సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల నుంచి కూరగాలు దిగుమతి అవుతాయి. వీటిలో వారం క్రితం టమాటా కిలో రూ. 20 ఉంటే క్రమంగా పెరిగి రూ.40 కి చేరింది. వంకాయలు కిలో రూ.30 ఉంటే అది కాస్తా రూ.60కి చేరింది. బెండకాయలు కిల్లో రూ.30 నుంచి రూ.50కి, కాకరకాయలు కిలో రూ.40 ఉంటే రూ.60కి, బీరకాయలు కిలో రూ.40 ఉంటే రూ.60కి పెరుగుతూ వచ్చాయి. గత నెలలో కురిసిన అకాల వర్షాలకు బీర, బెండ, దొండ, కాకర పంటలు దెబ్బతిన్నాయి. అధిక ఉష్ణోగ్రతలకు కాపు సక్రమంగా లేకపోవడంతో వంకాయలు చాల తక్కువగా వస్తున్నాయి. ఉన్న పంటలు చివరి దశకు చేరుకున్నాయి. దీనివల్ల దిగుబడులు తగ్గి మార్కెట్లకు తగినంత సర ఫరా ఉండడం లేదు. నిత్యం వినియోగించే ఈ రకాలు సత్తెనపల్లి రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్ దిగుమతి తగ్గడంతో కిలోకు రూ.20 వరకు పెరగగా మరి కొన్నింటి ధరలు రెట్టింపయ్యాయి. ఓ వైపు పండించిన రైతులకు గిట్టుబాటు కాక కొంతమంది రైతులు ఆందోళన చెందుతుంటే ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు బెంబేలు ఎత్తుతున్నారు. ఎండలకు కొనుగోలు దారులు లేక వ్యాపారులు బేరాలు తగ్గుముఖం పటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం వ్యవధిలోనే కిలో బెండ రూ .20 నుంచి రూ.30 వరకు పెరిగాయి. వర్షాలు పడితే కొత్త పంటలు వేసే అవకాశాలు ఉన్నాయని, ఆగస్టు వరకు పరిస్థితి ఇదే విదంగా కొనసాగే అవకాశాలు ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు.

కూరగాయలు వారం క్రితానికి, ప్రస్తుతం ఉన్న ధరల వ్యత్యాసం...

కూరగాయలు	వారం క్రితం కిల్లో ధర రూ.	ప్రస్తుతం కిల్లో ధర రూ.
టమాటా	20.00	40.00
వంకాయలు	30.00	60.00
బెండకాయలు	30.00	50.00
కాకరకాయలు	40.00	60.00
బీరకాయలు	40.00	60.00
దొండకాయలు	30.00	50.00
గోరుచిక్కుళ్ళు	50.00	50.00
పచ్చిమిర్చి	50.00	60.00
బీన్స్	100.00	120.00
బంగాళదదుంపలు	30.00	35.00
క్యారెట్	50.00	60.00
క్యాబేజి	30.00	40.00
క్యాలీఫ్లవర్	50.00	70.00
దోసకాయలు	30.00	50.00

వైద్యశాలకు ఫర్నిచర్, సోడియం హై ప్రో క్లోరైడ్ వితరణ



సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామ కృష్ణ ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువగల ఫర్నిచర్, సోడియం హై ప్రో క్లోరైడ్ ను మంగళవారం వితరణ చేశాడు. కొత్త రామకృష్ణ మాట్లాడుతూ టీబీ యూనిట్‌కి అవసరమైన ఫర్నీచర్ లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకువచ్చారని, దీంతో తన సొంత డబ్బులతో కుర్చీలు కొనుగోలు చేశానన్నారు. అలాగే ఆపరేషన్ థియేటర్‌కి ఇన్ఫెక్షన్ రాకుండా చూసే సోడియం హైప్లో క్లోరైడ్‌నీ మెడికల్ హోల్సేల్ అసోసియేషన్ అధ్యక్షుడు రావిక్రింది మల్లికార్జునరావు (మల్లి) సహకారంతో సుమారు రూ.15 వేల విలువగల ఐటమ్స్ వితరణ చేశామన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ వైద్యశాలకి అవసరమైన మౌలిక వసతులు అందించడంలో రామకృష్ణ ముందు ఉంటాడని, ఎప్పటికప్పుడు హాస్పటల్ అభివృద్ధిలో తనదైన ముద్ర వేస్తున్నాడని కొనియాడారు. డాక్టర్ రావిక్రింది శ్రీధర్, టీబి యూనిట్ సూపర్వైజర్ స్టాలిన్, హెడ్ నర్స్ రవణమ్మ, నర్సింగ్ సూపరిండెంట్ రాధ పాల్గొన్నారు.

పకడ్బందీగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి
- సత్తెనపల్లిలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు ఆకస్మిక తనిఖీ



పట్టణంలో గర్భిణులకు పౌష్టికాహారం కిట్స్ పంపిణీ చేస్తున్న పద్మావతి

సత్తెనపల్లి: చిన్నారులకు పోషకాహారం అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తోందని ఈ కేంద్రాలకు వస్తున్న, ఇంటి వద్దనే ఉండి టీహెచ్ఆర్ తీసుకుంటున్న పిల్లల ఆరోగ్య పరిస్థితిపై ప్రతినెల సర్వే జరుగుతుందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి చెప్పారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి ప్రాజెక్టు పరిధిలోగల పట్టణంలోని 20వ వార్డు, 22వ వార్డు ఒకటవ అంగన్‌వాడీ కేంద్రం, రెండో వార్డులోని ఒకటి, రెండు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు ఇస్తున్న పౌష్టికాహారం సక్రమంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు, అందుతున్నాయా? మెనూ ప్రకారం స్పాట్ ఫీడింగ్ ఇస్తున్నారా? అని తల్లులను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం కనుక ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని గర్భిణులు, చిన్నారులకు ఆరోగ్యపరంగా సలహాలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్స్‌లో ఆరు రకాల పౌష్టికాహారమైన రాగి పిండి, బెల్లం, అటుకులు, చిక్కిలు, జొన్నపిండి, ఖర్జూరాలు అందరికీ అందడం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని హాజరు పట్టిక, ప్రీ స్కూల్ బోధన పద్ధతులను క్షుణ్ణంగా పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పౌష్టికాహారాన్ని పరిశీలించి తలులకు రక్తహీనతను నివారించడం కొరకు ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టీఫైడ్ రైసును వినియోగించు కోవాలన్నారు. ఆకుకూరలు, ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా తీసుకోవాలని తల్లులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలపై పూర్తిస్థాయిలో నిఘా నడుస్తుందని, ఎక్కడ లోటుపాట్లు లేకుండా చూసేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. సూపర్వైజర్ల నివేదికలతో పాటు స్వయంగా తనిఖీలు జరుగుతున్నాయని, ఎక్కడైనా సమస్యలు కనిపిస్తే నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన ద్వారా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వీటితో పాటు బాల్యవివాహాలు నిరోధకానికి ప్రత్యేక ప్రణాళిక అమలవుతుందని, మహిళా పోలీసులు, సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్ల భాగస్వామ్యంతో బాల్య వివాహాలను నియంత్రించడం జరుగు తుందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై బాలికలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో తయారు చేసిన ఆహారాన్ని పరిశీలించారు. కోడిగుడ్లు, పౌష్టికాహారాన్ని పరిశీలించి సూచనలు చేశారు. చిన్నారుల బరువు, ఎత్తు కొలిపించారు. కార్యక్రమంలో సీడీపీఓ టీ. శ్రీలత, ఏసీడీపీఓ టీ.సంతోష్ కుమారి, సూపర్వైజర్లు టీ.ప్రమీల, జి.జయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తదితరులు ఉన్నారు.

సీఎం సభకు వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించండి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మండల స్థాయి అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండి ఈ నెల 12న సీఎం జగన్ సభకు వచ్చే ప్రజలకు అన్నీ సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి పెదకూరపాడు నియోజకవర్గానికి సీఎం జగన్ వస్తున్నందున సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కోరారు. గ్రామాల నుంచి తరలివచ్చే కార్యకర్తలు, ప్రజల కోసం అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సభకు తరలివచ్చే వారికి పార్కింగ్ స్థలాలు ముందుగానే నిర్ణయించాలన్నారు. వేసవి కాలం కావున ప్రజలకు మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయాలని చెప్పారు. అత్యవసరమైన వైద్యసేవల కోసం వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.అన్ని శాఖల అధికారులు సిబంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ పి.శివరాయమ్మ, హౌసింగ్ఏఈలు, ఏపిఓ, ఏపీఎం, మెడికల్ ఆఫీసర్లు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి




మాట్లాడుతున్న పురుషోత్తమరావు

సత్తెనపల్లి: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వచ్చే రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమరావు అన్నారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ వారి ద్వారా ప్రతిష్టాత్మకమైన జాతీయ నాణ్యతా ప్రమాణాల హామీ సూచీ ధ్రువీకరణ పురస్కారమునకు ఫణిదం పీహెచ్‌సీ ఎంపిక కావడంపై మంగళవారం వైద్యశాల ప్రాంగణంలో వైద్యశాల అభివృద్ధి కమిటీ నిర్వహించిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పురుషోత్తమరావు మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది సమిష్టి కృషి కి ఇది నిదర్శనమన్నారు. ఫణిదం పీహెచ్‌సీకి కేంద్ర ప్రభుత్వ ఎన్ క్వాస్ ధ్రువీకరణ పురస్కారం పొందడంలో ఆసుపత్రి పరిపాలన, పారిశుధ్య నిర్వహణ, బయట, లోపల రోగులకు అందించే వైద్య సౌకర్యాలు,ఆరోగ్య నిర్ధారణ పరీక్షలు,మౌలికమైన వసతుల కల్పనలో ఔషధాల అందుబాటు,వ్యాధి నివారణా కార్యక్రమాలు,కాన్పుల నిర్వహణ,రోగులకు అందించే వైద్య సేవల సంతృప్తి స్థాయి సూచిక వంటి అన్ని విషయాలపై గత మార్చి 11, 12 తేదీలలో రెండు రోజుల పాటు కేంద్ర బృందం తనిఖీ అనంతరం కేంద్ర పరిశీలనా బృందం పంపిన నివేదిక ప్రకారం ఫణిదం పీహెచ్‌సీకి 87.37 స్కోర్ సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. సభలో సత్తెనపల్లి మండల పరిషత్ అధ్యక్షు రాలు షేక్ యలవర్తిపాటి జైబూన్ బి, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు విజయభాస్కరరెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జీవీ సత్యనారాయణ, తహశీల్దార్ కె.నగేష్,ఫణిదం గ్రామ పంచాయతీ సర్పంచ్ వేమవరపు బుల్లిబాబు ఎంపీటీసీ సభ్యురాలు పల్లెపోగు రాహేలమ్మ, ఆసుపత్రి స్థల విరాళ దాత పంచుమర్తి అప్పారావులు పీహెచ్‌సీవైద్యులు,సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు వేమవరపు. ప్రదీప్, యశ్రీ లక్ష్మి కవిత, సిహెచ్.ఓ. సీతారావమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు పి.వెంకట రావు, ఖదీర్, పి.హెచ్.ఎన్ మీనాక్షమ్మ, సూపర్ వైజర్స్ పెండెం మణిరావు, యం.వెంకటే శ్వర్లు, ఫార్మసీస్ట్ సత్యనారాయణ, ఎమ్ఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

జాబ్ కార్డు ఉన్న వారందరికీ పని కల్పిస్తాం

మాదల(ముప్పాళ్ళ): జాబ్‌కార్డు ఉన్న వారందరికీ వంద రోజులు పని దినాలు కల్పించడం జరుగుతుందని ఎమ్ఎస్ఆర్ఈజీఎస్ ఏపీడీ వెంకటనారాయణ చెప్పారు. మండలంలోని మాదల గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను మంగళవారం పరిశీలించారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పనిదినాలు పని కల్పించేలా ప్రణాళికలు తయారు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ఉపాధి కల్పించటమే లక్ష్యంగా పనులు ఎంపిక చేశామన్నారు.

మృతుడి ఆధార్‌పై 12 ఏళ్లుగా పింఛన్



క్రోసూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో మృతుడి పేరు, పెన్షన్ లబ్ధిదారుడి పేరు ఒకటే కావడంతో 12 ఏళ్లుగా పెన్షన్ పొందుతున్నట్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచిత్రవార్త వెలుగుచూసింది. గ్రామ వలంటీర్ కొల్లి ఇస్తరీ చెప్పిన వివరాల మేరకు దొడ్లేరుకు చెందిన పారా కిరీటీ అనే వ్యక్తి 2001లో మృతి చెందాడు. అదే కుటుంబానికి వియ్యంకుడైన కూచిపూడి రాజారావు తన కుమార్తె (కిరీటీ కోడలు) వద్ద(దొడ్లేరులో) ఇంట్లో ఉంటున్నాడు. తనకు వేరే రేషన్‌కార్డు ఎందుకని కిరీటీ రేషన్‌కార్డులో సభ్యుడుగా నమోదయ్యాడు. అప్పట్లో మృతి చెందిన కిరీటీకి ఆధార్‌కార్డు లేదు. అయితే రాజారావు 2011లో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా రాజారావు ఆధార్ నంబర్ పై పారా కిరిటీ పేరుతో పింఛన్ జాబితాలో పేరు వచ్చింది. దీంతో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అప్పటి అధికారుల సలహా మేరకు రాజారావు పేరును కిరీటీగా ఆధార్‌కార్డులో పేరు పేరు మార్పించుకున్నాడు. అప్పటి నుంచి పింఛన్ పొందుతున్నాడు. అనంతరం వలంటీర్ల వ్యవస్థ వచ్చిన తరువాత వేలిముద్రలు ,ఆధార్ వివరాలు అన్నీ సక్రమంగా ఉండడంతో పింఛన్ సక్రమంగా చెల్లింపు జరుగుతుంది. స్థలం గురించి జరుగుతున్న వివాదంలో బంధువులు కొందరు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. అదేవిధంగా స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగినట్లు తెలిపారు.

రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మేకల హనుమంతరావు

అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో ఒకట్టి అయిన రైతు భరోసాకేంద్రాలు గ్రామాల్లో రైతులకు సాగుకు సంబంధించిన అన్ని విషయాల్లో కొండంత అండగా నిలుస్తున్నాయని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. మంగళవారం మండల పరిదిలోని జూపూడి రైతుభరోసా కేంద్రంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. అలాగే వేల కోట్లరూపాయలు ఖర్చుచేసి వ్యవసాయాన్ని రైతుకు లాభసాటిగా మార్చారన్నారు. అలాగే ప్రతి గ్రామంలో రైతు భరోసాకేంద్రాలు నిర్మించి వాటి ద్వారా నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు తక్కువ ధరలకు ఆగ్రామంలోనే అందిస్తున్న ఘనత జగనన్న దేనన్నారు. అలాగే నియోజక వర్గంలో వ్యవసాయాన్ని రైతులు సజావుగా సాగించేందుకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో విశేషకృషి చేస్తున్నారన్నారు. ఈసందర్భంగా మండల వ్యవసాయాధికారి అహ్మద్ మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. జీలుగలు కేజీ రూ. 79 రూపాయలుండగా రూ. 39.50 రూపాయలకు జనుములు రూ. 84 రూయలుండగా రూ. 42 రూపాయలకు పిల్లిపెసర రూ. 97రూపాయలుండగా రూ. 38.80 రూపాయలకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో ముకుందరావు మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన కౌలురైతులు కౌలురైతు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జెట్టి నాగరాజు, పి శివారెడ్డిలతో పాలుగా వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు కార్డులు ఇవ్వాలని వినతి



గ్రామ వీఆర్ఓకి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నేతలు

సత్తెనపల్లి: కౌలు రైతుల గుర్తింపు కార్డుల కోసం, భూ యజమాని సంతకం తప్పనిసరి అనే అంశం తొలగించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు దుగ్గి మేరమ్మ అన్నారు. సత్తెనపల్లి మండలం కందులవారిపాలెం గ్రామ వీఆర్ఓకి మంగళవారం వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట రుణాలు, రైతు భరోసా, క్రాఫ్ ఇన్సూరెన్స్, ఇన్పుట్ సబ్సిడీలు, పంట నష్ట పరిహారాలు కౌలు రైతులకే ఇవ్వాలన్నారు. కౌలు రైతులు సంతకాల సేకరించి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు చలువాది లక్ష్మీనారాయణ, పెండ్యాల మహేష్, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బగ్గీ వెంకటేశ్వర్లు, మక్కపాటి నరసింహారావు, కౌలు రైతులు వెంకయ్య, నరసింహారావు, రామారావు, నాగ బిక్షం, సత్యవతి, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇరుకుపాలెం(ముప్పాళ): కౌలు కార్డుతో కౌలు రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతి కౌలు రైతు సీసీఆర్సీ పొందుటకు అర్హులేనని తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్ చెప్పారు. మండలంలోని మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లో రెవెన్యూ శాఖ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటసాగు హక్కుపత్రం పై అవగాహన కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్ మాట్లాడుతూ సీసీఆర్సీ కౌలు రైతుకి ఇవ్వడం వల్ల భూయజమాని హక్కులకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ఇది భూ యజమానికి, సాగుదారునికీ మధ్య ఉండే ఒప్పందం మాత్రమే అని చెప్పారు. ఈ కార్డు వల్ల పంటరుణాలు, పంటలబీమా, సున్నావడ్డీ లాంటి పథకాలు వర్తిస్తాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులకు సీసీఆర్సీ వల్ల రైతుభరోసా వర్తిస్తోందన్నారు. పంటలకు మార్కెట్‌లో ధర లేనప్పుడు ఆర్బీకేలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అమ్ముకోవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ, ఆర్ఐ కపిల్‌దేవ్, ఉపసర్పంచ్ సైదా, వీఆర్వో హరిప్రసాద్, వీహెచ్ఏ నరేష్ పాల్గొన్నారు.

కౌలురైతులకు గ్రామ సభలు ఏర్పాటు చేయాలని వినతి

సత్తెనపల్లి: ఎస్సీ, ఎస్టీ, కాలనీల్లో కౌలు రైతులకు గ్రామ సభలు ఏర్పాటు చేయాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, ఏరియా కోఆర్డినేటర్ మేడే వెంకట రమణ కోరారు. సత్తెనపల్లి తహసీల్దార్ కె.నగేష్‌ను కలిసి మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా చిన్నప్ప మాట్లాడుతూ పల్నాడు జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా ఎస్సీ, ఎస్టీలు, కౌలు రైతులుగా ఉన్నారని అదే విధంగా సత్తెనపల్లి మండలంలోని నందిగామ, భట్లూరు, కట్టమూరు, గోరంట్ల, దూళిపాళ్ల, రెంటపాళ్ల, ఫణిదం, అబ్బూరు, పాకాలపాడు గ్రామాల్లో అత్యధికంగా ఎస్సీ, ఎస్టీలు కౌలు రైతులు ఉన్నారన్నారు. సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, అచ్చంపేట మండలాల్లో అత్యధికంగా కౌలు రైతులు ఉన్నారని, గ్రామ సభలు మండల, గ్రామ స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఎన్‌జిఓలు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో గ్రామ సభలు ఏర్పాటు చేసి భూయజమానులు, కౌలు రైతులకు అవగాహన కల్పించి(సి సి ఆర్ సి) కార్డులు ఇప్పించి సన్న, చిన్న , ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రైతు భరోసా, ఇన్ పుట్ సబ్సిడీ, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, బ్యాంక్ రుణాలు, పచ్చి రొట్ట అనగా పిల్లిపిసర, జీలుగ, జనుము 50 శాతం సబ్సిడీపై ఎస్సీ, ఎస్టీ రైతులకు అందే విదంగా చూడాలన్నారు. డీబీఆర్సీ సంస్థ ప్రతినిధులుగా తాము కూడా భాగస్వాములు అవుతామన్నారు. కార్యక్రమంలో విప్పర్ల మోహన్, దావల ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం



ప్రతిష్టకు ముస్తాబైన దేచవరంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం

నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి గుడి ప్రతిష్ట మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 7వతేదీ ప్రతిష్ట సందర్భంగా మూడురోజుల విశేష పూజల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజాధికారులు జరిపించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ యాగశాలలో హోమాలు జరిపించారు. భక్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్ల విగ్రహం, ఆలయ శిఖరం, జీవధ్వజదండ ప్రతిష్ట చేయనున్నారు. బుధవారం ఉదయం 7:52 నిమిషాలకు చేయనున్న ప్రతిష్ట సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు భక్తసంఘం వారు తెలిపారు. త్రయాహ్నికదీక్షతో జరిపిస్తున్న మహోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

దాత ఔదార్యంతో పాతఫర్నిచర్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేయించిన బీరువా

అచ్చంపేట: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో ఎన్నోరోజులుగా మరమ్మతులకు నోచుకోని బీరువాలకు మొక్షం కలిగింది. ఇదే పాఠశాలలో 35 సంవత్సరాలపాటు ఉపాధ్యాయునిగా పనిచేసిన ముప్పాళ్ల గోపాలకృష్ణమూర్తి జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకటేశ్వర్లు తన సొంత ఖర్చులతో మంగళవారం అయిదు టేకు చెక్క బీరువాలను, రెండు ఇనుప బీరువాలను మరమ్మతులు చేయించి వాటికి నూతనహంగు వచ్చేలా రంగులు వేయించి పాఠశాలలో గ్రంథాలయ నిర్వహణకు అప్పగించారు. అదేవిధంగా పాఠశాలలో ఆఫీసు రికార్డు భద్రపరచుకునేందుకుగాను మరో నూతన బీరువాను బహూకరించారు. మరమ్మతులు, నూతన బీరువా విలువ సుమారు రూ. 20వేల వరకు ఉండవచ్చుని అంచనా. ఇటీవల కాలంలో ఉపాధ్యాయులు గోపాలకృష్ణమూర్తి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సుమారు రూ.6 లక్షల వ్యయంతో పాఠశాల పాతభవన మరమ్మతులకు తమ వంతుగా విరాళం ఇచ్చారు.

ఎండలకు చల్లటి మజ్జిగ పంపిణీ

సత్తెనపల్లి: మండుతున్న ఎండలకు బాటసారులకు చల్లటి మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు అన్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. బాబురావు మాట్లాడుతూ ఎండాకాలం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేయడం అందులో మమ్మల్ని కలుపుకొని కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్న కొత్త రామకృష్ణ నీ అభినందించారు. అంతేగాక గత 45 రోజుల నుంచి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నా కూడా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసి ఎంతోమందికి దాహం తీరుస్తున్నారని కొనియాడారు. అనంతరం బాబూరావు నీ సంఘ సభ్యులు అందరూ కలిసి ఘనంగా సన్మానించారు. పెరుమళ్ళ సుధాకర్ సహకారంతో మంగళవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కొల్లిపర కుమార్, కాశీ విశ్వనాథం, రాఘవ, హరి, మాచర్ల సత్యనారాయణ, కాకర్ల రమేష్, స్వామి ప్రసాదు, చెక్క రవికుమార్ సురేష్, వెంకట్, సైదేష్, మోహన్ బాండ్ తదితరులు ఉన్నారు.